గోదావరి నుంచి 20 టిఎంసిలు తీసుకొస్తాం

- మూసీ ప్రక్షాళనపై పూర్తి డిపిఆర్ వచ్చాక సభలో చర్చిస్తాం
- తెలంగాణలో బీజెపి ఎందుకు అడ్డుకుంటోంది?
- రియల్ ఎస్టేట్ ఒక ఇండస్ట్రీ.. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- మూసీ పునరుజ్జీవనంపై శాసనసభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

' మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపుల్లో దాగి ఉన్న విషం అత్యంత ప్రమాదకరం. ఎందుకు విషం కక్కుతున్నారు. పని కల్పించేనా విషయుంది. వాటిలో చూస్తే ఐతమే. దానినికప్పిపుచ్చుకోవడానికి కండ్లలు పెట్టుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే కోపం ఎందుకు వస్తుంది? మీ సభ్యులైన అంబర్‌పేట్, ఉప్పల్ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నారు. వారిని చూసైనా బుద్ధి తెచ్చుకోండి. అసలు మీరు మూసీ ప్రక్షాళన చేయాలంటున్నారా? వద్దంటున్నారా? చెప్పండి. వాళ్లకు చేయొద్దని ఉంది. అంబర్‌పేట శ్మశాన వాటిక నుంచి మృతదేహాలు కొట్టుకొస్తుంటే, కంపెనీల కాలుష్యం వస్తుంటే దాని మధ్యే పేదలు ఎల్లకాలం నివసించాలా? ఇది మీకు పట్టదా? కాంట్రాక్టులు ఇచ్చుడు..కమీషన్లు కొట్టుడు..ఫామ్‌హౌజ్‌లలో పోయి పండేటోళ్లకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. మేం 80 వేల పుస్తకాలు చదవలేదు. డీపీఆర్ పూర్తయ్యాక మూసీ ప్రక్షాళనపై సభలో చర్చిస్తాం. అందరి అభిప్రాయాలు తీసుకుంటాం. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలతో మాట్లాడుతాం. ఇలా అందరి అభిప్రాయాలను తీసుకునే ముందుకెళ్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్‌కోసం అక్కడి బీజెపి ప్రభుత్వం 60 వేల కుటుంబాలను తరలించింది. యుపిలో గంగా ప్రక్షాళన చేపట్టారు. ఇప్పుడు ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన కోసం పని మొదలుపెట్టారు. గుజరాత్, యూపీ, ఢిల్లీలో కాంగ్రెస్ ఏమైనా అడ్డుకున్నదా? బీజెపి వాళ్లు ఇక్కడ ఎందుకు అడ్డుకుంటున్నారు?' అని సిఎం ప్రశ్నించారు. రెండు రోజుల విరామం అనంతరం శీతాకాల సమావేశాలు పున:ప్రారంభం అయ్యాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మూసీ నది పునరుజ్జీవంపై బీఆర్ఎస్ పక్ష ఉపనేత హరీశ్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి, సభ్యులు బాలునాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, శంకర్, కాలేరు వెంకటేశ్, రామ్మోహన్‌రెడ్డి, పాయల్ శంకర్ మాట్లాడారు. వారికి శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చే క్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు.

మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన బాపూ ఘాట్ నిర్మించనున్నాం. నాటి నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు కట్టారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరానికి శాశ్వత వరద సమస్య పరిష్కారానికి నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించిందని తెలిపారు. అవి ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. ఆగర్భ శ్రీమంతుల ఫామ్‌హౌజ్‌ల డ్రెయినేజీని



ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లలో కలుపుతుంటే ఉక్కుపాదం మోపి అడ్డుకున్నామన్నారు. తనను రియల్ ఎస్టేట్ బ్రోకరని, ఇంకా ఏదేదో అని విమర్శలు చేస్తున్నా పట్టించుకోకుండా ముందుకెళ్తున్నామని చెప్పారు. రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ అనీ, దానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకుంటున్నాయనీ, లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్, జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ పర్యటనల్లో తమకు ఇదే అర్థమైందని తెలిపారు.

మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని సిఎం అన్నారు. ఒకప్పుడు అదే నీళ్లు తాగిన అక్కడి ప్రజలు ప్రస్తుతం కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాలు కలిసి వచ్చే నీళ్లతో అనారోగ్యాల పాలవుతున్నారనీ, మూసీ పరివాహక ప్రాంతంలో పండే పంటలు, కూరగాయలు తిన్న మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యుల నివేదికలు ఎత్తిచూపుతున్నాయని వివరించారు. మూసీని ప్రక్షాళన చేయాలని నల్లగొండ జిల్లా ప్రజలు తమను వేడుకున్నారన్నారు. ఆ జిల్లా ప్రజల మాటలను విన్నాక, ప్రపంచ నగరాలను చూశాక మూసీలో శుద్ధమైన నీటిని ప్రవహింపజేయాలనే నిర్ణయానికి వచ్చామన్నారు. కన్సల్టెన్సీలను నియమించుకుని మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామనీ, ఈసా, మూసా కలిసే బాపూఘాట్ వద్ద వీ షేప్‌లో గాంధీ సరోవర్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనుకుంటున్నామని తెలిపారు. అక్కడ నుంచి 20 టిఎంసిలను తరలించి అందులో 15 టీఎంసీలు నగర అవసరాలకు, మిగతా ఐదు టిఎంసిలను మూసీలో నిరంతరం ప్రవహింపజేసేందుకు వాడుతామని వివరించారు. గాంధీ సరోవర్‌కు మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు రూ.నాలుగు వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించిందనీ, గాంధీ సరోవర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి కూడా లభించిందని తెలిపారు. 200 ఎకరాలను అడగ్గా ఇప్పటికే రక్షణ శాఖకు చెందిన 55 ఎకరాలను కేంద్రం ఇచ్చిందని, మిగతాది కూడా ఇచ్చేందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూత్రపాయ అంగీకారం తెలిపారని చెప్పారు. గత పాలకుల మాదిరిగా కేసుల నుంచి తప్పించుకోవడానికి కేంద్రంతో సఖ్యతగా ఉండట్లేదనీ, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతతో మెలుగుతున్నామని స్పష్టం చేశారు. తమని హిడెన్ ఎజెండా కాదని, తమది అభివృద్ధి ఎజెండా అని తెలిపారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామన్నారు.

పాతబస్తీని తామెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదనీ, ఓల్డ్‌సిటీ ఒరిజినల్ సిటీ అని సిఎం నొక్కి చెప్పారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు సైబరాబాద్ సిటీకి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే పునాది వేసిందని చెప్పారు. రాబోయే 20 ఏళ్లలో పట్టణీకరణ 75 శాతానికి పెరుగుతుందన్నారు. మూసీ ప్రక్షాళన చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కోరుతున్నారని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామంటే వాళ్లు అలాగే ఉండాలన్నట్లుగా విపక్షం ప్రవర్తిస్తున్నదని విమర్శించారు. మంచిరేవుల దగ్గర మూసీ పరివాహకంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేస్తామనీ, అట్లాగే మూసీ పరివాహక ప్రాంతంలో గురుద్వార్, మసీదు, చర్చిలను నిర్మించి మత సామరస్యాన్ని చాటబోతున్నామని తెలిపారు. డిపిఆర్ సిద్ధమయ్యాక అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. గ్రేటర్ ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఏం అభివృద్ధి కావాలో చెప్పాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతం నుంచి తరలించే పేదలకు బ్రహ్మాండమైన కాలనీలు నిర్మిస్తామనీ, మెరుగైన వసతులు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే తమ సంకల్పానికి సహకరించాలని ప్రజలను కోరారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిపక్ష నేతలు కడుపుల్లో విషం పెట్టుకుని మాట్లాడొద్దని చురకలు అంటించారు. బహుషా వారి మనస్సులు బాగు కావాలంటే వికారాబాద్ అడవుల్లో కొంత కాలం విడిచిపెడితే బాగుంటుందేమో అని వ్యాఖ్యానించారు.



వార్డు సభ్యులను సన్మానిస్తున్న జాన్‌వెస్లీ

మున్సిపోల్స్‌లో కౌన్సిలర్, చైర్మన్ స్థానాలు గెలవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఎం, వామపక్షాలు బలోపేతం అయ్యేలా కృషి చేయాలని, కౌన్సిలర్లు, చైర్మన్ స్థానాలను గెలిపించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కార్యకర్తలకు సూచించారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని జియస్ భవనంలో శుక్రవారం పామిరెడ్డిపల్లి సర్పంచ్ కుర్వ బాలయ్య, ఉపసర్పంచ్ వెన్నెల మోహన్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఎం బలపర్చిన అభ్యర్థులు గెలుపొందడంపై జాన్‌వెస్లీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఎం, వామపక్షాల బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పని చేయాలని కోరారు. కౌన్సిలర్లు, చైర్మన్ స్థానాలను గెలుచుకోవాలని దిశా నిర్దేశం చేశారు.రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసిల రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపితే.. రాష్ట్రపత్తి వద్ద పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదన్నారు. బిసిల 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయటంలో బిజెపి నేతలు శ్రద్ధ చూపటం లేదన్నారు. రానున్న మున్సిపల్, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో బీసీల 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని సిఎంను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎండి. మహమూద్, అమరచింత మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జియస్.గోపి, నాయకులు బి వెంకటేష్. ఎస్ అజయ్, టి రాఘవేంద్ర, శ్యామ్ సుందర్, దేవర్ల మోహన్, నందిమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి : ఎన్ఎ స్టాలిన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగాన్ని బిజెపి నిర్వీర్యం చేస్తున్నదని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ) బిల్లు తీసుకురావడం సిగ్గుచేటు అని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానం, విబిఎస్ఎ బిల్లు రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్‌కు సంబంధించిన రూ.9,300 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, గద్వాల్ విజయలక్ష్మి

దేశంలోనే అతిపెద్ద నగరంగా 'గ్రేటర్' హైదరాబాద్

- జనాభాకు తగ్గట్టు మౌలిక సదుపాయాల కల్పన
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బృహత్ నగరంగా ఆవిర్భవించిన నేపథ్యంలో జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. జిహెచ్ఎంసి నిధుల్లో నుంచి రూ.ఆరు కోట్లతో హుస్సేన్‌సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన 'చిక్కడపల్లి - దోమలగూడ లింక్ బ్రిడ్జి'ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ లోపల, ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న పురపాలికల విలీనంతో విస్తీర్ణం.. జనాభా పరంగా గ్రేటర్ హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించిందన్నారు. ఇక్కడ జనాభాకు తగ్గట్టు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పార్కులు ఇతరత్రా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. జిలా ఇన్‌చార్జి మంత్రిగా.. స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ సమన్వయం చేసుకుంటూ నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, కార్పొరేటర్లు, ఎస్ఈ మోహన్ రెడ్డి, ఇఇ రోహిణి, డిఇఇ రేణుక, ఎఇఇ ప్రశాంత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల వాట్సప్‌నకు హాల్‌టికెట్లు

- ఇంటర్ బోర్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల వార్షిక హాల్‌టికెట్లను డౌన్ చేసుకునేందుకు వీలుగా లింక్‌ను వారి తల్లిదండ్రుల వాట్సప్ నెంబర్ కు పంపించనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం పరీక్షల కంట్రోలర్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని తల్లిదండ్రులు అర్థం చేసుకునేలా, పరీక్షల నిర్వహణ మరింత పారదర్శకంగా ఉండబోతుందని వెల్లడించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమ ఎస్సెస్సీ రోల్ నెంబర్, పుట్టిన తేదీని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ మొదటి సంవత్సరం హాల్ టికెట్ నెంబర్‌ను, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితో పాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సంబంధించి పాసైన సబ్జెక్టులు, ఫెయిలైన సబ్జెక్టులు, ఎగ్జామినేషన్ షెడ్యూల్ తదితర వివరాలను పొందుపర్చనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల హాల్‌టికెట్‌లో సబ్జెక్ట్, మీడియం, గ్రూప్, ఫోటో, సిగ్నేచర్, వ్యక్తిగత వివరాల సరిగా ఉన్నాయో? లేవో? చూసుకుని ఏవైనా మార్పులు అవసరమైతే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ లేదా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌ను సంప్రదించాలని సూచించారు.

పేదల కడుపుకొట్టే విధంగా కేంద్రం విధానాలు

- 'ఉపాధి'ని నీరుగార్చేందుకే విబి జి ఆర్ఎఎం జి..
- రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

పేదల కడుపుగొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, వాటిని ఉద్యమాలతో తిప్పి కొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయా పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేందుకు విబి జి ఆర్ఎఎం జి పథకాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. మహాత్మాగాంధీ పేరును తొలగించడంతోపాటు ఉపాధిహామీ చట్టానికి నిధులు తక్కువ చేసి పేదలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదల కడుపుగొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలన్నారు. విద్యుత్‌రంగంలో తీసుకొచ్చిన సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్‌పరం చేసి పేదలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉత్పత్తిరంగంలో కీలకంగా ఉండే కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తూట్లు పొడిచేందుకు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని చెప్పారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికులు, రైతులు వ్యవసాయకూలీలు పెద్దఎత్తున ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సైన్స్ విజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ముప్వా రామారావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, డాక్టర్ జె రాజు, ఎంసిపిఐయు రాష్ట్ర నాయకులు వస్కుల మట్టయ్య, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, అంజయ్య, చాంద్‌పాషా, సీతారాములు, తిరుపతి రామ్మూర్తి, కోడిరెక్క మల్లయ్య పాల్గొన్నారు.

'గ్రేటర్'లో 27 మున్సిపాల్టీలు విలీనం

- రెండు ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతి
- గూడ్స్ వాహనాలకు జీవితకాలానికి పన్ను
- పలు బిల్లులకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

వివిధ శాఖలకు సంబంధించిన పలు బిల్లులను శాసనసభ ఆమోదించింది. మున్సిపల్ విద్యా, రవాణా, పంచాయతీ,ఎక్సైజ్ శాఖలకు సంబంధించిన చట్టాలకు పలు సవరణలను ప్రతిపాదిస్తూ ఆయా శాఖల మంత్రులు శాసనసభలో బిల్లులను ప్రవేశ పెట్టారు. శుక్రవారం అసెంబ్లీలో పలు బిల్లులపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి తరుపున ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మున్సిపల్ చట్టానికి సవరణలు ప్రతిపాదించారు. తెలంగాణ ప్రయివేటు విశ్వవిద్యాలయ బిల్లుకు మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా చట్టానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సవరణలు ప్రతిపాదించారు. వీటిపై బిజెపి,ఎంఐఎం,సిపిఐ సభ్యులు అభ్యంతరాలను లెవనెత్తారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ మున్సిపాల్టీల విలీనంపై సిబ్బంది కొరతపైన ప్రధానంగా ప్రస్తావించారు. గ్రేటర్‌లో విలీనం వల్ల పేదలు, మధ్యతగరతి వర్గాలపై పన్ను భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంద్రేష్, ఐవోలు గ్రామాలను గ్రేటర్‌లో కలపాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అస్థిత్వాన్ని దెబ్బతీయకుండా చూడాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విలీనమవుతున్న మున్సిపాల్టీల్లో అదనపు పన్నుల భారం ఉండబోదని భరోసా ఇచ్చారు. దీని వల్ల సమర్థవంతమైన పౌర సేవలు అందుతాయని తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు, పౌరసేవల్లో అసమగ్రత ఉందనీ, ఈ చట్టం ద్వారా వాటిని సరి చేస్తామన్నారు. సుస్థిర అభివృద్ధి, సమగ్ర పట్టణాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. మున్సిపాల్టీలపై వివిధ స్థాయిల్లో ప్రజల అభిప్రాయాలను తీసుకున్నట్టు తెలిపారు. విలీన ప్రక్రియతో గ్రామాల్లో ఉపాధి ఈ రాష్ట్రంలో పేదలకు ఎలాంటి సాయం చేస్తున్నారంటూ బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా ఆక్షేపించారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపికి ఈ చట్టం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లును వ్యతిరేస్తున్నాం :కూనంనేని


వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ ప్రతిపాదించిన తెలంగాణ ప్రయివేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తున్నదని సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావుస్పష్టం చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయకుండా ప్రయివేటుకు ఊతం ఇవ్వడం సరైందికాదన్నారు. విద్యారంగంలోకి ప్రయివేటు సంస్థలను ఆహ్వానించడమేంటని ప్రశ్నించారు. ఈ బిల్లును ప్రవేశ పెట్టడమంటే, పేదలను విద్యకు దూరం చేయడమేనన్నారు. అనేక దేశాల్లో విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని గుర్తు చేశారు. బిజెపి సభ్యులు హరీశ్‌బాబు మాట్లాడుతూ ప్రయివేటు విశ్వ విద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీలకు రిజర్వేషన్లు ఉంటాయా? ఫీజురీయింబర్స్‌మెంట్, ఫీజు రాయితీలు ఉంటాయా? అని ప్రశ్నించారు. ఇవి మైనార్టీయా, నాన్ మైనార్టీయా, ప్రయివేటు సంస్థలా? చెప్పాలంటూ ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ నిలదీశారు.

గృహజ్యోతితో 52.82 లక్షల మందికి లబ్ధి

- రూ.3,593 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లించాం
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యురాలు విజయశాంతి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో గృహ జ్యోతి లబ్ధిదారుల సంఖ్య 52,82,498 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.3,593.17 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లించిందని వివరించారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో 25,35,560 లక్షల మంది, ఎన్‌పిడిసిఎల్ పరిధిలో 27,46,938 లక్షల మంది ఉన్నారని తెలిపారు. బిజెపి సభ్యులు ఎవిఎన్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాదానం చెబుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 18వ తారీఖున కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒకటో



తేదీన జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకు ఉద్యోగుల ప్రయోజనాలు చెల్లించకుండా రిటైర్మెంట్ వయోపరిమితిని మూడేళ్లు గత ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సిఎం అన్నారు. వయోపరిమితి పెంచకుంటే 2021 నుంచి 2023 మధ్య సంవత్సరాల్లో 26,854 మంది పదవి విరమణ పొందే వారనీ, పెంపుతో కేవలం 6,354 మంది మాత్రమే రిటైర్ అయ్యారు. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ బెనిఫిట్స్ రూ.1,752 కోట్ల చెల్లించాం. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 6,244 కోట్లు ఉన్నాయనీ, వాటిని క్లియర్ చేసేందుకు ప్రతి నెలా రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని తెలిపారు. ఉద్యోగుల మెటర్నిటీ, చైల్డ్ కేర్ లీవ్‌ల పెంపుపై పిఆర్‌సిసి నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

యూరియా కొరత తీర్చండి



- మండలిలో సర్కార్‌ను నిలదీసిన ప్రతిపక్షం
- అపోహలు నమ్మొద్దు.. ఒకటి, రెండు చోట్ల మినహా అంతటా దొరుకుతోంది : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం రైతులు రాత్రుళ్లు షాపుల ముందు చలిలో పడిగాపులు కాస్తున్నారని బిఆర్ఎస్ సభ్యులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసనమండలిలో సర్కార్‌ను నిలదీశారు. "గత సర్కార్ పదేండ్ల పాలనలో రైతులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్న దాఖలాలు లేవు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రవేశపెట్టిన కృషి వికాస్ యోజన యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఇంటర్నెట్ రాకపోవడం, సర్వర్ బిజీ లాంగ్వేజ్ ప్రాబ్లమ్ తదితర సాంకేతిక సమస్యలతో యూరియాను సరైన సమయంలో పొందలేకపోతున్నారు. యాప్‌లో తలెత్తిన సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌లేదు. స్మార్ట్ ఫోన్ లేని వారు కొనుగోలు చేసేందుకు ప్రత్యామ్నాయం చూపలేదు. సాంకేతిక సమస్యలకు తోడు సరైన స్టాక్ అందుబాటులో లేకపోవడంతో రాత్రుళ్లు రైతులు జాగారం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే సర్కార్ రైతులకు యూరియాను అందుబాటులో తేవాలి" అని ఆయన డిమాండ్ చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల సమాధానం చెబుతూ రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని అన్నారు. డిసెంబర్ 31 నాటికే 4.04 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశామనీ, ఇది గత ఎనిమిదేండ్లల్లో అత్యధికమని చెప్పారు. "రాష్ట్రంలో ఉన్న 12,000 సెంటర్లలో, ఎక్కడో 2, 3 సెంటర్లలో ఉన్న లైన్లను చూపి రాజకీయ పబ్బం గడపాలనుకుంటున్నారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ రాష్ట్రంలో కూడా అమలు చేశాం. దీన్ని తీసుకొచ్చే ముందు రైతులందరికీ అవగాహన కల్పించాం. ప్రతీ రిటైల్ అవుట్ లెట్ వద్ద ఒక వలంటీర్‌ను అందుబాటులో ఉంచాం. యాప్ ద్వారా డిసెంబర్ 20 నుంచి ఇప్పటివరకు 1.18 లక్షల మంది రైతులు 3.36 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేశారు" అని తుమ్మల తెలిపారు. మరో సభ్యులు దాసోజు శ్రవణ్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ సేంద్రీయ వ్యవసాయ విస్తీర్ణం పెంచేందుకు రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కృషి వికాస్ యోజన కింద 60:40 నిధులతో గతంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో కొంత ప్రయత్నం జరిగింది. దాన్ని అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం" అని మంత్రి తెలిపారు. అలాగే మరో సభ్యులు తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ఇప్పటి వరకు రూ.95 కోట్లు రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించామని, మిగతా మొత్తాన్ని త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

ఎసిబికి చిక్కిన కొల్లూరు ఎస్ఐ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2025 అక్టోబర్‌లో కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.508/2025 (బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 318(4), ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 7) కేసులో ఫిర్యాదుదారుని పేరు తొలగించేందుకు ఎస్ఐ రూ.30,000 లంచం డిమాండ్ చేశారు. మొదటి విడతగా డిసెంబర్ 17న రూ.5,000 తీసుకున్నారు. కాగా, ఫిర్యాదుదారుడు తాజాగా ఎసిబి అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎస్ఐ ఫిర్యాదుదారుని నుంచి రూ.20,000 తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి ఎస్ఐని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎస్ఐపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎసిబి డిఎస్‌పి తెలిపారు.



టై హైదరాబాద్ నూతన అధ్యక్షుడిగా మురళి కాకర్ల

హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా ఔత్సాహికవేత్తల నెట్‌వర్క్ అయినా టై హైదరాబాద్ నూతన అధ్యక్షుడిగా ముళి కాకర్ల నియమితులయ్యారు. 2026 సంవత్సరానికి గాను ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ఉపాధ్యక్షుడిగా రవి చెన్నుపాటిని ప్రకటించింది. ఇన్నోబాక్స్ సిస్టమ్స్ వ్యవస్థాపకులు, సిఇఒగా ఉన్న మురళీ కాకర్ల ఈ బాధ్యతలను రాజేష్ పగడాల నుండి స్వీకరించారు.



కియా కొత్త సెల్టోస్ ధర రూ.10.99 లక్షలు

హైదరాబాద్ : ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరల శ్రేణీని రూ.10.99 లక్షలు– రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. జనవరి రెండో వారం తర్వాత నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని కియా వెల్లడించింది. డిసెంబర్ 11 నుంచి రూ.25,000 టోకెన్ మొత్తంతో బుకింగ్స్ ప్రారంభించింది.

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై అప్పులపాలు

- అవి తీర్చలేక యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగింది. కామారెడ్డి పట్టణ సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఓం శాంతి కాలనీకి చెందిన శ్రీకర్ (30) అనే యువకుడు ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కాగా, ఏడాదిన్నర నుంచి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ అప్పులు చేశారు. అప్పులు భరించలేక ఇల్లు అమ్మి కొంత తీర్చాడు. మరిన్ని అప్పులు ఉండడంతో అవి తీర్చే దారిలేక మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి వల్లందేసి గోదావరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ కంటే సిఎం మాటల కంపే ఎక్కువ

- స్పీకర్ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణి
- అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నాం
- బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత హరీశ్‌రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ కంపు కంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల కంపే ఎక్కువున్నదని బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మూసీ ప్రక్షాళన కాదనీ, ముందు సిఎం నోరు ప్రక్షాళన చేయాలని చెప్పారు. అసెంబ్లీలో స్పీకర్ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా ఈ అసెంబ్లీ సమావేశాలను బిఆర్ఎస్ పార్టీ బహిష్కరిస్తోందని ప్రకటించారు. శుక్రవారం స్పీకర్ ఏకపక్షంగా సభను నడుపుతున్న తీరుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక, అసభ్యకర ప్రవర్తనకు తీరుకు నిరసనగా అసెంబ్లీలో బిఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ శాసనసభ నడుస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధంగా ఉందన్నారు. బిఎసి సమావేశానికి తమను గంటన్నర సేపు ఆపి అవమానించారని చెప్పారు. సభను ఏడు రోజుల పాటు నడపాలని, ఆ తర్వాత మళ్లీ సమావేశమై తదుపరి షెడ్యూల్ నిర్ణయించాలని స్పష్టంగా అనుకున్నామని గుర్తు చేశారు. కానీ సభలో ప్రవేశపెట్టిన మినిట్స్‌లో మాత్రం సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ నిర్ణయానికే వదిలేస్తున్నామని తప్పుడు సమాచారం పొందుపరిచారని వివరించారు. స్పీకర్ సభను కస్టోడియన్‌లా కాకుండా, ఏకపక్షంగా నడుపుతున్నారని అన్నారు.

మోడీని రాహుల్ విమర్శించడం లేదా?

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని హరీశ్‌రావు చెప్పారు. ప్రశ్నోత్తరాల్లో పది ప్రశ్నలుంటే, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తమ మైక్ కట్ చేశారని అన్నారు. పార్లమెంట్‌లో ప్రధాని మోడీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించడంలేదా? ఇక్కడ తాము సిఎంను ప్రశ్నిస్తే మైక్ ఎందుకు ఆపేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని విమర్శించొద్దని స్పీకర్ తమకు చెప్పడం ఎక్కడి పద్ధతని అడిగారు. ప్రతిపక్షం మాట్లాడకూడదంటే అసలు సభ ఎందుకనీ, తమను ఎందుకు పిలిచినట్టని అన్నారు. సభలో సిఎం రేవంత్‌రెడ్డి బాడీ షేమింగ్ చేస్తూ మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రిలా కాకుండా వీధిరౌడీలా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీని సిఎల్‌పి సమావేశంలా, గాంధీభవన్‌లాగా మార్చేశారని విమర్శించారు. సభలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బయట మాట్లాడినట్టే సొల్లు వాగుడు వాగుతున్నారని అన్నారు. కెసిఆర్ గురించి అడ్డగోలుగా మాట్లాడటం సరైంది కాదన్నారు. కెసిఆర్‌పై రేవంత్‌రెడ్డి వాడిన భాషను తీవ్రంగా ఖండించారు. మూసీ ప్రక్షాళనకు గోదావరి జలాలను మల్లన్న సాగర్ నుంచి తెస్తున్నారా? అని అడిగితే దానికి సమాధానం చెప్పలేదన్నారు. రాహుల్ గాంధీ దేశంలో రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతుంటే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. అవినీతికి అధికారికంగా రేట్లు పెట్టి మరీ పెంచిన రేవంత్ రెడ్డికి తమ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సభలో సభ్యులందరికీ సమాన హక్కులు కల్పించాల్సిన స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత
బర్సే దేవా సరెండర్

- మరో 15 మంది సైతం..
- నేడు వివరాలు వెల్లడించనున్న తెలంగాణ డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు అగ్రనేత బర్సే దేవా తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు. మరో 15 మంది మావోయిస్టులతో కలిసి బర్సే దేవా శుక్రవారం సరెండర్ అయ్యారు. మావోయిస్టు పార్టీలో కీలకమైన గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా దేవా బాధ్యతలు నిర్వర్తించారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీలో ఆయన కీలకంగా ఉన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ బలగాల వ్యవహారాలను చూసేవారు. మావోయిస్టులకు ఆయుధాల సరఫరాలో కీలక పాత్ర పోషించారు. హిడ్మా, బర్సే దేవా ఛత్తీస్‌గఢ్‌లో ఒకే గ్రామానికి చెందిన వారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి బర్సే దేవా బృందాన్ని గురువారం పోలీసులు తీసుకొచ్చారు. బర్సే లొంగుబాటు వివరాలను డిజిపి శివధర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడిస్తారని పోలీసు అధికార వర్గాలు తెలిపాయి.

చౌటుప్పల్ నుంచి ఫార్మా
పరిశ్రమలను తరలించండి

- మండలిలో సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం డిమాండ్
- సిఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం – మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఫార్మా కంపెనీలను చౌటుప్పల్ ప్రాంతం నుంచి తరలించాలని సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న విష రసాయన వ్యర్థాలతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. గొంతు నొప్పి, శ్వాసకోశ, ఊపిరితిత్తులు, కంటి, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాంతం మరో పటాన్‌చెరుగా మారే ప్రమాదం ఉంది. రసాయన, ఫార్మా పరిశ్రమల నుంచి ప్రమాదకరమైన వ్యర్థాలను నియంత్రించడంలో కాలుష్య నియంత్రణ మండలి విఫలమవుతోంది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సమాధానం చెబుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్యం వల్ల కలిగే పంట నష్టంపై కమిటీ వేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. ఈ ప్రాంతం నుంచి పరిశ్రమల తరలింపుకు సంబంధించి సిఎంతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి సంబంధించి బీఆర్ఎస్ సభ్యులు ఎల్.రమణ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ రూ.350 కోట్లతో మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచన మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

నదీ జలాలపై కెసిఆరే మాట్లాడాలి

- హరీశ్‌రావుకు అప్పగిస్తే అంతా మ్యాచ్ ఫిక్సింగే
- బిడ్డగా చెబుతున్నా.... నాన్న అసెంబ్లీకి రావాలి : కవిత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నదీ జలాల అంశంపై అసెంబ్లీలో బిఆర్ఎస్ పక్షాన ఆ పార్టీ అధినేత కెసిఆర్ మాట్లాడితేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌లో బబుల్ షఉటర్ హరీశ్ రావును డిప్యూటీ ఫ్లోర్ లీడర్ చేశారనీ, జలాలపై ఆయన చేత మాట్లాడితే అంతా మ్యాచ్ ఫిక్సింగ్ అవుతుందని హెచ్చరించారు. ఇప్పటికే హరీశ్ రావు సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారని ఆమె ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్టులో ప్యాకేజ్‌ను హరీశ్‌రావు అమ్ముకున్నారని ఆమె ఆరోపించారు. తన తండ్రి కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని ఆమె ఆకాంక్షించారు. కెసిఆర్ అసెంబ్లీకి రాకపోతే బీఆర్ఎస్‌ను ఆ దేవుడు కూడా కాపాడలేడని వ్యాఖ్యానించారు. గతేడాది సెప్టెంబర్ 3న కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినప్పటికీ ఆ రాజీనామాను శాసనమండలి చైర్మన్ ఇప్పటికీ ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం కవిత శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో భేటీ అయ్యారు. తాను రాజీనామా చేసేందుకు దారి తీసిన కారణాలను చెప్పుకునేందుకు కౌన్సిల్‌లో తనకు అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. అనంతరం ఆమె మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ తన కోరికను మన్నించి జనవరి 5 లేదా 6వ తేదీల్లో ఒక రోజు హౌస్‌లో మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తానని చైర్మన్ మాటిచ్చినట్టు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని చైర్మెన్‌ను కోరినట్టు స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని కవిత హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులను తీవ్రవాదులతో పోల్చుతారా? అంటూ ప్రశ్నించారు. 12 సంవత్సరాల్లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో ఒక్క ఎకరానికి నీళ్లు పారలేదని స్పష్టం చేశారు. జూరాల నుంచి శ్రీశైలంకు ఇన్‌టేక్ పాయింట్ ఎందుకు మార్చారో కేసీఆర్ మాత్రమే చెప్పగలరన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు ఆయన స్థాయికి తగ్గట్టుగా లేవని తప్పుపట్టారు. రేవంత్ రెడ్డి తన తండ్రి కెసిఆర్‌పై చేసిన విమర్శలకు తన రక్తం మరుగుతోందని చెప్పారు. కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. అంతటి స్థాయి కలిగిన కెసిఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని కొట్టిపారేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు చట్టపరమైన చిక్కులున్నాయని కాంగ్రెస్ సర్కారు సాకులు చెబుతోందనీ, అయితే బీమా, నెట్టంపాడు, సుందిళ్ల, కల్వకుర్తికి ఏమైంది? కల్వకుర్తిలో రెండు మోటార్ల రిపేర్‌కు ఎందుకు నిధులు ఇవ్వడం లేదు? అని ఆమె ప్రశ్నించారు. బీమా, నెట్టంపాడులో సగం సామర్థ్యం మేర కూడా నీళ్లు లేవని ఆమె విమర్శించారు. ఇప్పటికైనా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఇన్‌టేక్ సోర్స్‌ను మార్చాలని ఆమె డిమాండ్ చేశారు. 27 వేల ఎకరాలు భూసేకరణ చేసి ఒక్క కాలువ నిర్మించకుండా, డిప్యూటీ సిఎం 12 వేల ఫైళ్లను పెండింగ్‌లో పెట్టుకున్నారని ఆమె దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి బలమైన ప్రజాశక్తిగా పోటీలో ఉంటుందని కవిత ప్రకటించారు.

సిఎం దగ్గర సబ్జెక్ట్ లేదు.. సంగతీ లేదు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరం బూతు సంవత్సరంలాగా ప్రారంభమైంది.. సిఎం దగ్గర సబ్జెక్ట్ లేదు.. సంగతీ లేదు అని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం ఉదయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లేదు గానీ బూతులు ఎక్కువగా ఉన్నాయన్నారు. కేసీఆర్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. ఉరి తీయాలి అంటూనే సలహాలు ఇవ్వాలంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల నుంచి కాంగ్రెస్ సర్కార్‌పై పూర్తి స్థాయి వ్యతిరేకత ఉందన్నారు. జూరాలలో ఇవాళ కూడా క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు.

కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో నీటి విడుదల జరుగుతుందన్నారు. తెలంగాణ పట్ల అవగాహన ఉన్నవాళ్లు సలహాదారుగా ఉండాలి కానీ ఆదిత్యనాద్ దాస్ సలహాలు తీసుకుని ఎపికి నీళ్లు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఆంధ్ర వ్యక్తిగా తెలంగాణ ప్రాజెక్టులపై కేసులు వేసిన వ్యక్తిని సలహాదారుగా నియమించుకుంటారా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆదిత్యనాద్ దాస్‌ను తొలగించి తెలంగాణ వ్యక్తిని నియమించాలన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయని, నీటి వాటాల విషయంలో కెసిఆర్ చేసిన కృషి ఫలితంగానే తెలంగాణకు వాటా దక్కిందన్నారు. బనకచర్ల ఎక్కడుందో కూడా తెలియని వ్యక్తి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో కూడా తెలియదన్నారు. వితండవాదం చేయకుండా సబ్జెక్ట్ తెలుసుకోవాలని హితవు పలికారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా తీయలేదని, పిచ్చి మాటలు మానేసి రేవంత్‌రెడ్డి హుందాగా మాట్లాడాలని సూచించారు. రేవంత్‌రెడ్డికి ఈ ఏడాది మంచి బుద్ధి ఇవ్వాలని, ఆయన గుణం మారాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు అధికార మదం – విప్ కెపి వివేకానంద


ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుని దగ్గరికి వెళ్లి వీడియోలు తీయించి.. అసెంబ్లీ ప్రారంభం కాకముందే ఆ వీడియో రిలీజ్ చేసి డ్రామాలు చేస్తున్నారని బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. ప్రతిపక్ష నాయకుడిపై బయట ఇష్టానుసారంగా మాట్లాడుతూ.. లోపల డ్రామాలు ఆడుతున్నారన్నారు.

ఇన్ని రోజుల సభలో ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ప్రభుత్వం సమాధానం చెప్పలేదన్నారు. అధికార మదంతో కాంగ్రెస్ నేతలకు కండ్లు నెత్తికెక్కాయన్నారు. తాము మాట్లాడుతుంటే మైకులు కట్ చేస్తున్నారని, అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ గొంతుకై తాము మాట్లాడతామన్నారు. శాసనసభ జీరో అవర్‌తో స్టార్ట్ చేసి కొత్త సంప్రదాయానికి తెరలేపారన్నారు. తమ పార్టీ తరపున ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

'యాదాద్రి' నిర్మాణంలో రూ. కోట్ల నిధుల దుర్వినియోగం

- తీన్మార్ మల్లన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



యాదాద్రి దేవాలయ నిర్మాణంలో కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. శుక్రవారం శాసనమండలి సమావేశంలో ఆయన ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. పొరుగుసేవల ప్రాతిపదికన అధికారిని నియమించి ఆయన ద్వారా రూ.1,300 కోట్లకు టెండర్ పిలిచారని ఆయన తెలిపారు. రూ.17 లక్షల కోట్ల కాంట్రాక్ట్ ఒప్పందానికి బదులుగా 27 రెట్లు అధికంగా రూ.4.78 కోట్లు, రూ.25 లక్షలయ్యే మరో పనికి రూ.3.96 కోట్లు, రూ.51 కోట్లయ్యే పనికి రూ.145 కోట్లు, అదే విధంగా మరో పనికి రూ.129 కోట్లు ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు ఇచ్చి రూ.1,300 కోట్లకు తప్పుడు లెక్కలు చూపించారని విమర్శించారు. సమాచార హక్కు చట్టం ద్వారా తాను సేకరించిన వివరాలను ఆయన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి అందజేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని, సభా సంఘాన్ని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్‌రావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని కోరారు. బీఆర్ఎస్ శాసనమండలి పక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాల లేమి, సిబ్బంది కొరత కారణంగా రోగుల సంఖ్య తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. సభ్యులు ఒంటేరు యాదవరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను తగ్గించే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. సీపీఐ సభ్యులు నెలకంటి సత్యం మాట్లాడుతూ యాదవులకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతేడాది జనవరిలో చేసిన సమ్మె కాలం వేతనాన్ని చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్‌ను మినహాయించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో, కౌన్సిల్ తీర్మానం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేసిన పనులకు చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాలని కోరారు. శాసనమండలి చైర్మెన్ సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని చిన్న కాంట్రాక్టర్ల కోసం వెంటనే నిధులు విడుదలయ్యేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు వీలుగా కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంతో పాటు అమరవీరుల జ్యోతి వెంటనే సందర్శకుల కోసం తెరవాలని డిమాండ్ చేశారు. సభ్యులు బస్వరాజు సారయ్య మాట్లాడుతూ వరంగల్ సెంట్రల్ జైల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యులు బండా ప్రకాశ్ మాట్లాడుతూ మత్స్యకార సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు గోరెటి వెంకన్న మాట్లాడుతూ సాహిత్యకారులకు అవార్డులు ఇచ్చేలా తెలంగాణ సాహిత్య అకాడమీని ప్రోత్సహించాలని సూచించారు.

ఆటో జేఏసీ డిమాండ్లను బీఆర్ఎస్ శాసనమండలిపక్ష నేత మధుసూదనాచారి, మోడల్ స్కూల్ సిబ్బందికి జీతాలు ఆలస్యమవుతున్నాయని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, జగిత్యాల కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని ఎల్.రమణ పిటిషన్లు సమర్పించారు. సంచార జాతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని నవీన్ కుమార్ రెడ్డి, 2004కు ముందు నోటిఫికేషన్‌తో ఎంపికైన 2003 డీయస్సీ టీచర్లకు ఓపీఎస్ ను వర్తింపజేయాలని సభ్యులు శ్రీపాల్ రెడ్డి పిటిషన్లు సమర్పించారు.



ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిబిఎఫ్ నాయకులు

అనాజీపూర్ దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయండి

- పోలీసులను ఆదేశించిన రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితులను వేధిస్తే సహించేది లేదని, అనాజీపూర్ దళితులపై మూకుమ్మడిగా దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను, రెవెన్యూ అధికారులను రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన దళితుడు పారునంది యాదగిరి కుటుంబంపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ ఆధ్వర్యంలో బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన బక్కి వెంకటయ్య పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి నిందితులను అరెస్టు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బైండోవర్ పేరుతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి పారునంది యాదగిరిని ఎందుకు వేధిస్తున్నారని రాయపోల్ తహసీల్దారు, ఎస్ఐను ప్రశ్నించారు. కేసులుంటే కోర్టులో తేల్చుకుంటారని, లక్ష రూపాయలు కట్టమని మీరు ఎట్లా వేధిస్తారని నిలదీశారు. దళితులను వేధిస్తే ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చూస్తూ ఊరుకోదని తహసీల్దార్‌ను హెచ్చరించారు. పద్దతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో బాధితుడు పారునంది యాదగిరి, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, ఎస్‌సి, బిసి, మైనారిటీ నాయకులు, మాజీ సర్పంచ్ జాఫర్, గజ్వేల్ రాంచంద్రం, సతీష్, చాకలి యాదగిరి పాల్గొన్నారు.



షాపుల్లో లేని యూరియా యాప్‌లో ఉంటుందా?

- బిఆర్ఎస్ సభ్యుల ప్లకార్డుల ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

షాప్‌ల్లో లేని యూరియా యాప్‌లో ఉంటుందా అంటూ బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. 'కాంగ్రెస్ వచ్చింది యూరియా కొరత వచ్చింది'అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను సభ లోపలికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో పోలీసులతో బిఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. తాను మాట్లాడిన తర్వాతే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయని హరీశ్‌రావు చెప్పారు. యూరియా మీద కూడా రైతుల పక్షాన మాట్లాడితే యూరియా వస్తుందని అన్నారు.



అంధుల జ్ఞాననేత్రం లూయిస్ బ్రెయిలీ

ప్రజాశక్తి - కల్చరల్

అంధులు చదువుకోనేందుకు వీలుగా చుక్కల లిపిని కనుగొని వారికి జ్ఞాన నేత్రం ఇచ్చిన లూయిస్ బ్రెయిలీ తరతరాలు గుర్తుండిపోతారని సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా లూయిస్ బ్రెయిలీ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ మూడేళ్ల వయసులో ప్రమాద వశాత్తూ కళు కోల్పోయిన బ్రెయిలీ నిరాశ చెందక పట్టుదలతో చదువు కొని తనలా అంధులు చదువుకు దూరం కావొద్దు అని విశేష పరిశోధనలు చేసి బ్రెయిలీ లిపి కనుగొన్న మానవతా మూర్తి అని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై జాతీయ వికలాంగులు హక్కుల సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నేత శ్రీమణి, ఆధ్యాత్మిక వేత్త శ్యామ్ సుందర్ మల్లెపూల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ కళాశాల బస్సు బోల్తా

- గాయపడిన వారిని భద్రాచలం ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పాల్వంచ కెఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచలోని కెఎల్ఆర్ ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన బస్సు రోజు మాదిరిగానే మణుగూరు నుంచి సుమారు 40 మంది విద్యార్థులను ఎక్కించుకొని కళాశాలకు బయలుదేరింది. అశ్వాపురం మండలం మొండికుంట సమీపంలోని సాయిబాబా గుడి దగ్గరికి రాగానే ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కాలేజీ బస్సు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో మణుగూరుకు చెందిన విద్యార్థులు స్వర్ణాంబికకు తీవ్ర గాయాలుకాగా, తురక భవాని, నిమ్మగోట స్పందన, మానస, దివ్యకీ గాయాలయ్యాయి. మరి కొంతమంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. కళాశాల బస్సు ప్రమాదానికి గురైందన్న విషయం తెలిసిన వెంటనే మణుగూరు డిఎస్‌పి వంగా రవీందర్ రెడ్డి, అశ్వాపురం సిఐ జి అశోక్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ యాట శీనుతో పాటు కొందరు స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను 108 వాహనం ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, బస్సు పల్టీ కొట్టిన సంఘటనలో విద్యార్థులందరూ స్వల్ప గాయాలతో బయటపడడంతో వారి తల్లిదండ్రులు, పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మణుగూరు డిఎస్‌పి బస్సు ప్రమాదం జరిగిన చోటికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.